బాబోయ్ కోతులు


ఆసిఫాబాద్‌లో సంచరిస్తున్న కోతులు

- వానరాల వీరంగం
- ఇళ్లలోకి చొరబడి వస్తువుల అపహరణ
- భయాందోళనలో ప్రజలు
- కోతుల నియంత్రణలో అధికారుల విఫలం

ఆసిఫాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. కోతులు గుంపులుగుంపులుగా బయలుదేరి కాలనీలపై విరుచుకుపడుతున్నాయి. ఇళ్లు, దుకాణాలలో తినుబండరాలు, వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటు పండ్లచెట్లను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇళ్లలోకి చొరబడి వస్తువుల అపహరణ..

అడవిలో జీవించాల్సిన కోతులు ఊర్లమీద పడుతున్నాయి. అటవీ ప్రాంతాలు రోజురోజుకు తగ్గి పోవడం వాటికి అడవిలో ఆహారం లభించక గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్నాయి. గుంపులుగుంపులుగా కాలనీల్లో సంచరిస్తూ వీరంగం సృష్టిస్తున్నాయి. ఇళ్లలో తయారు చేసుకున్న భోజనలతోపాటు పప్పు దినుసులు పట్టుకెలుతున్నాయి. కిరణా షాపులు, పండ్ల దుకాణదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడదతో పెంకుటిళ్లలు ధ్వంసం అవుతున్నాయి. అరుబయట ఎండబెట్టిన పప్పు దినుసులు ఇతర ఆహార పదర్థాలను వదలటంలేదు. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి ఇతర పండ్ల చెట్లు, కూరగాయాల చెట్లను సైతం వదలకుండ ధ్వంసం చేస్తున్నాయి.

నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలి..

పట్టణంలో కోతుల నియంత్రణ కోసం అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి పట్టణం నుంచి అటవీప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. కోతుల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవల్సివస్తుందని వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారినుంచి రక్షణ కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

భయాందోళనలో ప్రజలు..

కోతుల బెడద రోజురోజుకు ఎక్కువ కావడంతో పట్టణ వాసులు భయందోళనలకు గురవుతున్నారు. ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో అవి ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. కొన్ని సందర్భాలలో కోతి కాటుకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. మిద్దెల మీద గుంపులుగుంపులుగా ఒకచోట చేరి వచ్చిపోయే వారిపై పైపైకి వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల బెడద తీవ్రం కావడంతో కొంతమంది టపాసులు, పెద్ద శబ్ధాలు చేసి వాటిని తరిమి వేస్తున్నారు.

కోతులతో ఇబ్బందులు పడుతున్నాం..



- జ్యోతి, ఆసిఫాబాద్

కోతులతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందరగా పడేసి వీరంగం సృష్టిస్తున్నాయి. పప్పుదినుసులు, ఆహార పదర్థాలు, కూరగాయాలు ఎత్తుకెళుతున్నాయి. వీటిని తరిమేందుకు ప్రయత్నిస్తే దాడులకు దిగుతున్నాయి. అధికారులు వెంటనే నియంత్రణ చర్యలు చేట్టాలి.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



- చిరంజీవి, ఆసిఫాబాద్

కోతుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. కోతుల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. కోతులు దాడులకు పాల్పడుతున్నాయి. వెంటనే వాటిని అటవీప్రాంతంలో వదిలిపెట్టే చర్యలు చేపట్టాలి.

ఏఎస్సై కుటుంబానికి చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్

ఆసిఫాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగాపూర్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నారాయణ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన భార్య సుశీలకు బుధవారం ఎస్పీ డీవీశ్రీనివాసరావు భద్రత ఎక్స్‌గ్రేషియా రూ.8లక్షలు, కార్పస్‌ఫండ్ రూ.50వేలు, విడోఫండ్‌రూ.10వేలు మొత్తం రూ.8.60 లక్షల విలువచేసే చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్సై కుటుంబానికి పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్‌లను తక్షణమే అందజేసే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసుకార్యాలయ ఏవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అజయ్‌వర్మ, పోలీసుసంఘం జిల్లాఅధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, సీసీ కిరణ్, ఏఎస్సై కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి


లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రభాకర్

కాగజ్‌నగర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న మోడల్‌లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగం ఎంఈవో ప్రభాకర్ అన్నా రు. బుధవారం చింతగూడపాఠశాలలో మండలస్థాయి మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీలో విలువైన పుస్తకాలు ఉంటాయన్నారు. నోడల్ అధికారి దేవాజీ మాట్లాడుతూ లైబ్రరీ విద్యార్థులకు అనుగుణంగా సులభరీతిలో ఆసక్తి పెంపొందించేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ నాగేందర్, కోఆప్షన్ బాబా, ప్రధానోపాధ్యాయులు ఎం స్వప్న, ఉపాధ్యాయులు వనజ, శిరీష, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ మధుకర్, ఏఏపీసీ చైర్మన్ గీత, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో మెనూ పాటించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న సీఈవో లక్ష్మినారాయణ

కెరమెరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో మెనూ పాటించాలని జడ్పీ సీఈవో లక్ష్మి నారాయణ అన్నారు. బుధవారం మోడి గిరిజన సంక్షేమశాఖ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా వంటగదిని పరిశీలించి మెనూప్రకారం భోజనంపెట్టాలని ఆదేశించారు. అనంతరం హాస్టల్‌పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. శీతాకాలంలో విద్యార్థులకోసంప్రత్యేకజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మోడి, ధనోరగ్రామంలో జరుగుతున్న సమగ్రఇంటింటిసర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, కార్యదర్శి అంబారావు తదితరులు ఉన్నారు.

సుంగాపూర్ లొద్దిలో పులి సంచారం

జైనూర్, నవంబరు 20, (ఆంధజ్యోతి): భూసిమెట్టపంచాయతీలో గల సుంగాపూర్ లొద్దిలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీఅధికారులు ధ్రువీకరించారు. సుంగాపూర్‌లొద్దిలో తాగునీరు అందుబాటులో ఉండటంతో పులి ఇక్కడే మకాం వేసింది. దీంతో చుట్టుపక్కల గ్రామాలప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. పులిప్రస్తుతం సుంగాపూర్‌లొద్దిలో ఉన్న ఆడపులి కోసం అన్వేషిస్తోందని అటవీఅధికారులు అంటున్నారు. ఉదయం పది తర్వాతనే వ్యవసాయం, ఇతర పనులకు వెళ్లాలని, సాయంత్రం 4గంటలకు ముందేతిరిగి ఇంటికి చేరుకోవాలని అటవీ అధికారులు సుంగాపూర్, భుసిమెట్ట, రాసిమెట్ట తదితర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

'కోయ పున్నెం గోండి ధర్మం'గా పొందుపర్చాలి

బెజ్జూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమగ్ర సర్వేలో ఆదివాసీలు 'కోయ పున్నెం గోండి ధర్మం' అని పొందుపర్చాలని బుధవారం ఎంపీడీవో గౌరీశంకర్, ఎంఈవో సునీత, సీనియర్ అసిస్టెంట్ అచ్చుత్‌రావుకు ఆదివాసీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టుతీర్పు ఆధారంగా గోండ్స్ ఆర్ నాట్ హిందూ అని చెప్పిన తీర్పు ప్రకారం గోండు, ప్రధాన్, తోటి, నాయకపోడ్, కోలాం ఇతర గోండి తెగలు హిందూమతం కింద పరిగణించరని అన్నారు. ఆదివాసీల తొమ్మిది తెగలు కోయపున్నెం గోండిధర్మం సమగ్రసర్వేలో ఈఅంశం లేకపోవడంతో ఆదివాసీ ఉపకులాలు హిందూమతం కింద పరిగణిస్తూ సర్వేకు వచ్చిన అధికారులు రాస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, తిరుపతి, సకారాం, శంకర్, రాజారాం, నారాయణ, సత్తయ్య, తుకారాం, వెంకటేష్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి


ఖాతిగూడలో రైతు చేనులో విదేశీయులు

సిర్పూర్(యు) నవంబరు20, (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని జాన్‌కేరిన, జాన్ విల్లెన్ అన్నారు. మండలంలోని ఖాతిగూడ, రాఘాపూర్ తదితర గ్రామాల్లో జర్మనీ, నెదర్లాండ్ దేశస్థులు బుధవారం రెండోరోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఖాతిగూడలోలో పత్తిఏరారు. అదేవిధంగా రాఘాపూర్‌లో సేంద్రియ ఎరువుల తయారీకేంద్రాన్ని వారు పరిశీలించారు. పంటల సాగులో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన చేతన్‌ఆర్గానిక్ బోర్డు జనరల్ సెక్రెటరీ ఆత్రం ఆనంద్‌రావ్‌ను అభినందించారు. అనంతరం విదేశీ ప్రతినిధి జాన్ కెరిన, జాన్‌వెల్లిన మాట్లాడుతూ తమదేశాల్లో ఫెర్టిలైజర్లు, పురుగుల మందులను పూర్తిగా నిషేధించామన్నారు. కార్యక్రమంలో చేతన్ ఆర్గానిక్ బోర్డు చైర్మన్ ఆత్రం నాగోరావ్, సీఈవో నందకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ దాసండ్ల ప్రభాకర్, సీనియర్ మేనేజర్ శ్రీకర్, రైతులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని బీజేపీ అసెంబ్లీకన్వీనర్ సొల్లు లక్ష్మి అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటుచేసిన ఎన్నికల వర్క్‌షాప్‌లో భాగంగా బూత్ స్థాయినుంచి పార్టీబలోపేతం కోసం చర్చించారు. పార్టీ బలోపేతానికి బూత్ అధ్యక్షుల నుంచి శక్తికేంద్రాల ఇన్‌చార్జీలను నియమిస్తామని, రాబోయే కాలంలో స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

దహెగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామకృష్ణ బుధవారం తనిఖీచేశారు. ఏఈవోలు అందుబాటులో ఉంటూ వరి, పత్తి దిగుబడులు విక్రయించడానికి ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, పీఏసీఎస్ కార్యదర్శి నారాయణ, సిబ్బంది జీవన్, రైతులు పాల్గొన్నారు. అలాగే లగ్గాం, ఒడ్డుగూడ, దహెగాం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజ్‌కుమార్, శ్రీనివాస్ పరిశీలించారు. వారివెంట ఏఈవోలు, పీపీసీ ఇన్‌చార్జిలు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

జైనూర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలేజీగూడవద్ద బుధవారం సాయంత్రం కెరమెరి మండలం నుంచి జైనూరుకు అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనాన్ని ఏఎస్ఐ బాబర్‌బేగ్ పట్టుకున్నారు.ఈ సందర్భంగా కెరమెరిమండలంలోని సుల్తాన్‌గూడకుచెందిన ఫయాజ్, షేక్‌హుస్సేన్‌ను అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. పశువులను తరలిస్తున్నట్లు ఎలాంటి పత్రాలు లేనందున ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుట్కా పట్టివేత

జైనూర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివనూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలతనిఖీలో భాగంగా బుధవారం రూ87,500 విలువగల గుట్కాను పట్టుకున్నామని జైనూర్ ఎస్ఐసాగర్ తెలిపారు. గుట్కాను సీజ్‌చేసి ఉట్నూరుకు చెందిన మహ్మద్ ఫైజాన్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధరణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వివిధరకాల భూసమస్యలపై ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తు లను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవోలోకేశ్వర్‌రావుతో కలిసి ధరణి ధ్రువపత్రాలు, కల్యాణలక్ష్మి పథకంపై తహసీల్దార్‌లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో విరాసత్, భూవిస్తీర్ణం సవరణ, పేరుసవరణ, నిషేధితజాబితాలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేకదృష్టి సారించాలని అన్నారు. కార్యాలయ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిబంధనలప్రకారం త్వరగా పరిష్కరించాలని తెలిపారు. కోర్టుకేసులు ఉన్నవాటిపై రికార్డులను పూర్తిగా పరిశీలించి నివేదిక అందించాలన్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబసభ్యుల ధ్రువపత్రాలకు మీసేవ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి జాబితాను రూపొందించాలని తెలిపారు.

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన..

గ్రూపు-4 ద్వారా రెవెన్యూశాఖలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో 2022లో నిర్వహించిన గ్రూపు-4పరీక్షకు సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో 39 మంది అభ్యర్థులు రెవెన్యూశాఖలో ఎంపికైనందున వారి ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమానికి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపికైన 30మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనత్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వారివెంట కలెక్టరేట్ ఏవో మధుకర్, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి..

ఆసిఫాబాద్ రూరల్: విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల14న నుంచి జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారన్నారు. గ్రంథయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. పుస్తకపఠనం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చని పోటీపరీక్షలకు హాజరయ్యే వారికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. గ్రంథాలయంలో పాఠకుల కొరకు, పోటీపరీక్షల అభ్యర్థుల కొరకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఇటీవల జరిగిన డీఎస్సీ, గ్రూపు-4, పోలీసు ఉద్యోగాలలో దాదాపు 20మందివరకు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరంవారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, మ్యూజికల్‌చైర్, పుస్తకాలప్రదర్శన, వ్యాసరచన, కవిసమ్మేళనం, పాటలపోటీలు, రంగోలిపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయకార్యదర్శి సరిత, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, జిల్లాపరీక్షల అధికారి ఉదయ్‌బాబు, అదనపుగ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, గ్రంథాలయ అధికారులు సదానందం, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్గుడలో ఏడీ విచారణ

ఆసిఫాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌మండలంలోని బూర్గుడ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో బుధవారం డీఈవోకార్యాలయ ఏడీ గమానియల్ విచారణచేపట్టారు. పాఠశాలహెచ్ఎం నిధుల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ టీయూటీఎఫ్, విద్యార్థిసంఘాల నాయకులు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేయడంతో ఏడీ ఈ విచారణ చేపట్టారు.

ఎక్స్‌గ్రేషియా పంపిణీ

జైనూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూసిమెట్ట క్యాంప్ పరిధిలో గల సుంగాపూర్ గ్రామానికి చెందిన సిడాం కన్నిరాంకు చెందిన ఆవు పెద్దపులి దాడిలో మృతిచెందగా బుధవారం ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, తదితరులు 25వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు జ్ఞానేశ్వర్, మజారోద్దిన్, డీఆర్వో రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

జైనూర్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోనిరాసిమెట్ట బాలికలఆశ్రమోన్నత పాఠశాలను ఏటీడీవో శ్రీనివాస్ బుధవారం తనిఖీచేశారు. విద్యార్థులకు మెనూ అందిస్తున్న తీరును అడిగితెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైనవిద్యను అందించాలనిఆదేశించారు.

ఉమ్మడిజిల్లా స్థాయి చదరంగ పోటీలు

రెబ్బెన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి చదరంగపోటీలు ఈనెల24న ఆసిఫాబాద్‌లోని గర్ల్స్ మోడల్‌స్పోర్ట్స్‌స్కూల్‌లో నిర్వహిస్తామని జిల్లా చెస్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు టోర్నమెంట్ కన్వీనర్ ఎం రవీందర్ ఒకప్రకటనలో తెలిపారు. ఓపెన్‌టుఆల్ విభాగంలో పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అండర్-11,-13,-14,-15 విభాగాల్లో నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఆసక్తిగల వారు తమపేర్లను నమోదు చేసుకోవాలని ఇందుకు ఆర్బిటర్ అంబాల కల్పన, ఎం శృతి ఫోన్‌నెంబరు 8978146456ను సంప్రదించాలన్నారు.

కార్యకర్తలతో సమావేశమైన కోనేరు కోనప్ప

సిర్పూర్(టి), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం మండలకేంద్రానికి వచ్చి కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ షకీల్, కీజర్ హుస్సేన్, బ్రహ్మయ్య, విక్రం, జునేద్‌అహ్మద్, నాని, ప్రేంసాగర్‌గౌడ్, లాలాజీ, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం..

కొత్త పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

వాంకిడి: ఉపాధిహామీ పథకం ద్వారా నూతనంగా చేపట్టాల్సిన పనుల కోసం ప్రతిపాదనలను సిద్ధంచేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 5నెలల్లో చేయాల్సిన పనులుగుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రావణ్‌కుమార్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్: అంతర్జాతీయబాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆసిఫాబాద్‌జడ్పీహెచ్ఎస్ ఉర్దుపాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు మహమ్మద్ అశ్రఫ్‌ఆధ్వర్యంలో ర్యాపిడాక్స్ స్పోకెన్‌ఇంగ్లీష్ పుస్తకాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో డీఆర్వో లోకేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు ఖాజానిజాముద్దీన్ పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: పట్టణంలోనితెలంగాణ ఆదర్శపాఠశాలలో అండర్-17బాలబాలికల నెట్‌బాల్‌ఎంపికపోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య, క్రీడల ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు.

నజ్రూల్‌నగర్‌లో గ్రామసభ

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో బుచ్చన్న మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకంపనుల ప్రణాళికలను రూపొందించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

రెబ్బెన: మండలంలోని తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యూకేషన్ హాస్టల్‌లో మహిళలకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా షీటీంఇన్‌చార్జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైబర్ క్రైంలపట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమొస్తే 100కు డయల్‌చేయాలన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు పొంది సకాలంలో చెల్లించాలి

సిర్పూర్(టి): డ్వాక్రాసంఘాల మహిళలు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించి లబ్ధిపొందాలని ఐకేపీ ఏపీఎం దుర్గయ్య అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో మండలసమాఖ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఇన్సురెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాఖ్యఅధ్యక్షురాలు లక్ష్మి,పద్మ,రాజేశ్వర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతలమానేపల్లి: విద్యార్థులుగ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని కర్జవెల్లి ఎంపీ యూపీఎస్ పాఠశాలలో జిల్లావిద్యాశాఖ, రూంటురీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో మోడల్‌లైబ్రరీని ప్రారంభించారు. ఈ సంద్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లైబ్రరినిఉపయోగించుకొని జ్ఞానాన్ని పొందాలని, జీవితంలో అత్యున్నతమైనస్థానంలో ఉండాలని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో ఎంఈవో జయరాజు, హెచ్ఎంవెంకటేశ్వర్లు, భీంరావు, రూంటురీడ్‌కో ఆర్డినేటర్ సంపతి పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

బెజ్జూరు: మండలకేంద్రంలోని ప్రధానరహదారిపై చెట్టు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం ఆర్టీసీ బస్సు వెళ్తున్నక్రమంలో చెట్టుకొమ్మ బస్సుకు తగిలి విరిగిపడింది. ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రెండుగంటలపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో కార్యదర్శి తుకారాం విరిగిపడ్డ చెట్టుకొమ్మను తొలగించాకరాకపోకలు ప్రారంభమయ్యాయి.

మత్స్యకారులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే హరీష్‌బాబు


దహెగాంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

పెంచికలపేట/దహెగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం పెంచికలపేట, దహెగాం మండలాల్లోని రైతువేదికల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పెంచికలపేట మండలం ఎల్లూరు బొక్కివాగు ప్రాజెక్టులో చేప పిల్లలను విడిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్య సంపదను పెంపొందించేందుకు అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఉపాధి పొందవచ్చని ఆయన అన్నారు. చెరువులలో చేపపిల్లలను వదిలే ముందు మత్స్యకార్మిక సంఘాల సభ్యులు వాటి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. అలాగే గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అంతర్గత రోడ్లు, శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలవివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, రాజన్న, సత్యనారాయణ, ప్రభాకర్‌గౌడ్, నగేష్, మహేష్, గణపతి, పురుషోత్తం, కాంతారావు, సంతోష్, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

దహెగాంమండలంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని కోత్మీర్-దహెగాం డబుల్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడంలో కాంట్రాక్టర్ ఆలస్యం చేస్తున్నాడని, అతన్ని తొలగించి మరో కాంట్రాక్టర్‌కు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు అప్పగించాలని సీఈకి తెలిపినట్లు తెలిపారు. మండలంలోని లగ్గాం అప్రోచ్ వద్ద నిర్మాణం చేపడుతున్న వంతెన నిర్మాణంలో భూములు నష్టపోతున్న రైతులకు పరిహారం అందించడానికి కృషిచేస్తానని రైతులకు హామీఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ ధనుంజయ్, ఎంఆర్ఐ శృతి, ఎంసీ ధన్‌రాజ్, నాయకులు సంజీవ్, సత్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది ఏదీ ఉండదు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తిర్యాణి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది ఏదీ ఉండని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హనుమండ్ల జగదీష్ ఇంటివద్ద డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన మండలంలోని గంభీరావుపేటకుచెందిన ఉపాధ్యాయులను, కుటుంబసభ్యులను, గ్రూపు-4లో ఉద్యోగం సాధించిన చింతపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌ను, అతని తల్లితండ్రులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది ఏదీ ఉండదని అన్నారు. ఇందుకు నిదర్శణం ఉద్యోగాలు సాధించిన ఏడుగురు యువకులేనని అన్నారు. అనంతరం మండలంలోని ఏడుగు రికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, కమల, వినోద్, బాదిరావు, గోపాల్, రాజయ్య, శంకర్, ప్రవీణ్, యశ్వంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మల్లేష్ (ఫైల్)

భీమారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకుదారి మల్లేష్ (28) అనే యువకుడు మృతిచెందాడు. జైపూర్ మండలం రసూల్‌పల్లి గ్రామానికి చెందిన మల్లేష్ పోలంపల్లిలోని ప్రైవేట్ పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం భీమారం నుంచి పాఠశాలకు బైక్‌పై వెళ్తుండగా చెన్నూరు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో మల్లేష్ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు సీఐ వేణుచందర్ తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మృతుడి తల్లి ఆకుదారి రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ తోట సాయి కిరణ్ పరారీలో ఉన్నాడని ఏసీపీ తెలిపారు.

టాటా ఏస్ వాహనం దగ్ధం



జైపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం బుధవారం దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం నెన్నెల మండలం అవుడం నుంచి వాహనంలో సుమారు పది మంది ఓ శుభకార్యానికి కరీంనగర్‌కు వెళ్తున్నారు. జైపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై షార్ట్ సర్క్యూట్‌తో ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ప్రయాణికులను దింపడంతో పెనుప్రమాదం తప్పింది. మంటలు ఎక్కువ కావడంతో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం బోల్తా

తాండూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి గ్రామంలోని జాతీయ రహదారిపై బుధవారం పత్తితో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. మంచిర్యాల నుంచి మండలంలోని రేపల్లెవాడ పత్తి జిన్నింగు మిల్లుకు వస్తున్న వాహనం ఓవర్ లోడ్ కారణంగా అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

ప్రాణహిత తీరంలో పోలీసుల తనిఖీలు


ప్రయాణికుల వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వేమనపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా అహేరి నియోజకవర్గంలో బుధవారం ఎన్నికలు జరిగిన నేపథ్యంలో నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలోని సిరొంచ తాలూకాలోనీ మొహిబీన్ పేట, మూలదిమ్మ, నర్సయ్యపల్లె, వెంకటపూర్, రేగుంట, పర్శువాడ, ఒడ్డుగూడెం, అక్కడి కోటపల్లి తదితర గ్రామాలు మండలానికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. ఈ గ్రామాల ప్రజలు వేమనపల్లికి సరుకుల కోసం నదిలో పడవల ద్వారా వచ్చి వెళ్తుంటారు. పోలీసులు వారి ఆధార్ కార్డులు, బ్యాగులు పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


మాట్లాడుతున్న వయోజన విద్యాధికారి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి మురళీతో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి పుస్తకాలు, మెటీరియల్, పత్రికలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. నిర్వాహకులు సాగర్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

మందమర్రిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని సారంగపల్లి, అందుగులపేట గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని, చెత్తాచెదారం, ప్లాస్టిక్ లేకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు వీరేందర్, శ్రావ్య పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 9.2డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత


బెజ్జూరులో చలిమంట కాగుతున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏజెన్సీ మండలాలు చలితీవ్రతకు వణికి పోతున్నాయి, రోజురోజు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. బుధవారం జిల్లాలోని సిర్పూరు(యు) మండలంలో 9.7డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అలాగే తిర్యాణి మండలంలో 11.1డిగ్రీలు, కెరమెరిలో 12.3డిగ్రీలు, వాంకిడిలో 12.4డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. చలితీవ్రతను తట్టుకునేందుకు గ్రామాల్లో చలిమంటలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

కొనసాగుతున్న చలి తీవ్రత

మంచిర్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో బుధవారం 12.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హాజీపూర్ మండలం ర్యాలీగడ్‌పూర్‌లో 12.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, జన్నారం మండల కేంద్రంలో 12.9డిగ్రీలు, జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 13.2 డిగ్రీలు, కాసిపేట మండలం కొండాపూర్‌లో 13.5 డిగ్రీలు, కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో 13.6డిగ్రీలు, కోటపల్లి మండలంలో 13.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పట్టాలెక్కని అనుసంధాన రోడ్ల అభివృద్ధి

- ప్రతిపాదనలకే పరిమితమైన వైనం
- కాగజ్‌నగర్-భీమిని మండలాల రోడ్లకు ప్రతిపాదనలు చేసి ఎనిమిదేళ్లు
- వంతెన నిర్మాణం కోసం ఎదురు చూపులు
- ఇంకా నిర్మాణ దశ వీడని కాగజ్‌నగర్-వాంకిడి రహదారి వంతెన


కాగజ్‌నగర్-వాంకిడి మధ్యలో నిర్మాణ దశలోనే ఉన్న వంతెన(ఫైల్)

కాగజ్‌నగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ మండలాల అనుసంధానంగా ఉన్న వంతెనలు, రోడ్ల నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి లేదు. ప్రభుత్వాలు మారుతున్నా వీటి పరిస్థితుల్లో ఎలాంటి మార్పులేదు. ఫలితంగా వివిధ మండలాలవాసులకు ఇక్కట్లు తప్పటం లేదు. సిర్పూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల అనుసంధాన రోడ్ల అభివృద్ధి పనుల స్థితిగతులపై ప్రత్యేక కథనం..

అసంపూర్తి దశలోనే..

కాగజ్‌నగర్-వాంకిడి మధ్యలో ఉన్న అంకుసాపూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం 2013లో రూ.1.50కోట్ల నిధులతో ప్రారంభించారు. నిధులు సకాలంలో విడుదల కాకపోవటంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. టెండరులో ఉన్న రేట్లకు వర్తమానంలో ఉన్నరేట్లు మూడింతలు కావటంతో అధికారులు రివైజ్ టెండరువేసి అదనంగా రూ.3కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. దీంతో మూడేళ్ల క్రితం నిధులు మంజూరు కావటంతో పనులు పిల్లర్లస్థాయి వరకు కొనసాగించారు. మళ్లీ నిధులు విడుదల కాకపోవటంతో పనులకు బ్రేక్‌పడింది. కాగజ్‌నగర్‌నుంచి వాంకిడి వెళ్లాలంటే ఆసిఫాబాద్ మీదుగా సరిగ్గా 41కిలోమీటర్లు ఉంటుంది. ఆసిఫాబాద్‌కు మీదుగా కాకుండా కాగజ్‌నగర్ నుంచి అంకుసాపూర్ మీదుగా వాంకిడికి వెళ్లితే 25కిలో మీటర్లు వస్తుంది. రవాణా సౌకర్యంతో పాటు దూరం తగ్గుతుందన్న ఉద్దేశ్యంతో అంకుసాపూర్ వాగుపై ఉన్న వంతెన నిర్మించేందుకు పనులు ప్రారంభించి నా కొన్ని నెలల పాటు చేయటం ఆ తర్వాత కురిసే వర్షాలతో పనులకు బ్రేక్ పడుతూ రావటం జరిగింది. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన వంతెన ఇప్పటికీ పూర్తి కాలేదు.

కాగజ్‌నగర్-భీమిని మండలాల పరిస్థితి అంతే..

కాగజ్‌నగర్ నుంచి భీమిని మండలాలకు వెళ్లేందుకు జగన్నాథ్‌పూర్ మీదుగా మార్గం ఉంది. జగన్నాథ్‌పూర్ గ్రామం దాటగానే చిన్న పాటి వాగు ఉంది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం కురిసిందంటే ఇక్కడ రాకపోకలు నిలిచి పోతాయి. ఈరెండు మండలాలకు అనుసం ధానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి పరిచేందుకు ఇరుమండలాల అధికారులు సర్వే నిర్వహించా రు. శాశ్వతదిశగా ప్రణాళికలు రూపొందించారు. రూ.10కోట్ల నిధులు అవసరమవుతాయని అంచ నాలు కూడా రూపొందించారు. కానీ ఇప్పటికీ ఎనిమిదేళ్ల గడిచినా కూడా ఎలాంటి పురోగతి లేదు. భీమిని నుంచి నిత్యం కాగజ్‌నగర్ ఆటోలు, ద్విచక్రవాహనాల్లో వివిధ అవసరాలకోసం కాగజ్ నగర్‌కు వస్తుంటారు. వర్షాకాలంలో వాగులు పొంగితే కాగజ్‌నగర్ భీమిని మండలకేంద్రానికి వెళ్లాలంటే కాగజ్‌నగర్ వయా ఇట్యాల మీదుగా భీమిని వెళ్లాల్సి ఉంటుంది. ఇలావెళ్లితే 27కిలో మీటర్ల దూరం వస్తోంది. అదే జగన్నాథ్‌పూర్ మీదుగా నేరుగా ఖర్జీభీంపూర్, భీమిని వెళ్లేందుకు రహదారి ఉండటం 20కిలోమీటర్ల దూరం వస్తుంది. భీమిని మండలానికి అతిదగ్గరగా ఉండటంతో ఈమార్గం గుండానే వెళ్లతుంటారు. భీమినిలో రైతులు పండించిన పంట లన్నింటినీ కూడా సమీపంలో ఉండే కాగజ్‌నగర్ వ్యాపారుల వద్దనే అధికంగా విక్రయిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి త్వరగా రోడ్లు వేయాలని ప్రజలంతా కోరుతున్నారు.

వంతెన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి..



అధికారులు కాగజ్‌నగర్-వాంకిడి మధ్య ఉన్న వంతెన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి. వంతెన నిర్మిస్తే నేరుగా కాగజ్‌నగర్-వాంకిడికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. ఆసిఫా బాద్‌కు సంబంధం లేకుండా కాగజ్‌నగర్- వాంకిడి వెళ్లే రహదారి ఉన్నా లాభం లేని పరిస్థితి. వంతెన పూర్తయితే ఇరుమండలాల అభివృద్ధికి జరిగేందుకు చక్కటిమార్గం అవకాశం ఉంటుంది. అధికారులు ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

-లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

టీపీటీఎఫ్ జిల్లా కమిటీ

కెరమెరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ జిల్లాకార్యవర్గాన్ని బుధవారం మండలంలోని మోడి ఆశ్రమపాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చవాన్‌నారాయణ, ప్రధానకార్యదర్శిగా వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగాసుందర్,కమల,కర్ను, ధర్మారావు,సంతోష్,కార్యదర్శులుగాగంగాసాగర్, భగవంతరావు, మన్మథ్‌రావు, గణేష్, లక్ష్మణ్‌రావు, రాష్ట్రకౌన్సిలర్లుగా శ్యాంరావు, అర్జున్,ఎడిట్‌కమిటీ కన్వీనర్‌గా నారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్

కౌటాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ తమ నిజాయితీని చాటుకున్నారు. బుధవారం కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు వెళ్తున్న ఉపాధ్యాయుడు రాంచందర్ తన మొబైల్ ఫోన్‌ను బస్సులో పోగోట్టుకున్నారు. ఫోన్ ఆర్టీసీ కండక్టర్ విశ్వజిత్, డ్రైవర్ ప్రభాకర్ ఉపాధ్యాయుడికి దొరకగా వారు రాంచందర్‌కి అప్పగించి నిజాయితీని చాటుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

బెజ్జూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై బుధవారం జిల్లా సాంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారెంటీపథకాలపై కళాజాతా నిర్వహించారు. ప్రభుత్వపథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కళాకారులకు కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమిని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ధనంజయ మెడికల్ షాప్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 వరకు నిర్వహిస్తామన్నారు. సంతాన సాఫల్య వైద్యురాలు హిమదీప్తి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సింగరేణి సహకారంతో పాఠశాలకు మెరుగులు

మందమర్రిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు సింగరేణి యాజమాన్యం వసతులు కల్పించింది. పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాఠశాల ఆర్చ్ బోర్డును బుధవారం ఏర్పాటు చేసింది.

నర్సరీ పరిశీలన

మందమర్రిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అందుగులపేట గ్రామంలోని నర్సరీని బుధవారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని సూచించారు. కార్యదర్శి వీరేందర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కోల్ ఇండియాలో పతకాలు సాధించాలి

మందమర్రిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న కోలిండియా పోటీల్లో పతకాలు సాధించి సింగరేణి పతాకం ఎగురవేయాలని ఏరియా ఏజీఎం వెంకటరమణ, ఏఐటీయూసీ ఏరియా బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. కోలిండియా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బుధవారం వర్క్‌షాపులో ఘనంగా సన్మానించారు. ఈ సారి జరిగే పోటీల్లో అన్ని పోటీల్లో బంగారు పతకాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో బానయ్య భీమనాధుని సుదర్శన్, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

శ్రీరాంపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బొగ్గునాణ్యత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు శ్రీరాంపూర్ ఓసీపీలో బుధవారం బహుమతులు అందించారు. వ్యాసరచన పోటీల్లో శ్రీనివాస్ మొదటి, అభినయ రెండవ, స్లోగన్ రైటింగ్ పోటీల్లో కె సంగీత మొదటి, రాజ్‌కుమార్ రెండవ, క్విజ్ పోటీల్లో రాజ్‌కుమార్ మొదటి, తిరుపతి రెండవ బహుమతులు పొందగా, ఎనిమిది మంది ప్రోత్సాహక బహుమతులు గెల్చుకున్నారు. వీరందరికి ఇన్‌చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్వాలిటీ ఇన్‌చార్జి కమ్రుద్దీన్, ఏఐటీయూసీ సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందించాలి

మందమర్రిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందజేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఏరియాలోని కేకే5 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడుతూ కార్మికులు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తుంటే ఉత్పత్తికి నాణ్యమైన పరికరాలు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. నాణ్యమైన బూట్లు, పరికరాలు, డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గని మేనేజర్ ప్రవీణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేంలాల్, మేకల సంతు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు మానుకోవాలి'

మందమర్రిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతేలక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న చౌకబారు విమర్శలు మానుకోవాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపట్టిన కుల గణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం పాలన పూర్తవుతున్న సందర్భంగా పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు దేవి భూమయ్య సది తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన నియామకాలు

శ్రీరాంపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి బీసీఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీలను బుధవారం నాయకులు ముష్కె సమ్మయ్య, బి మారుతి, బద్రి బుచ్చయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి, తమహక్కుల సాధనకు కృషిచేయాలని సూచించారు. త్వరలో జరగబోయే మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఏరియా వర్క్‌షాప్ కన్వీనర్‌గా పాడిశెట్టి వినోద్, కో-కన్వీనర్‌గా తన్నీరు శ్రీకాంత్, ఏరియా సీహెచ్‌పీ కన్వీనర్‌గా అందే రాజ్‌కుమార్, కో-కన్వీనర్‌గా కాసర్ల లక్ష్మణ్ ఎన్నికయ్యారు.



గనిపై ఉన్న సమస్యలను పరిష్కరించాలి

కాసిపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాసిపేట గనిపై అపరిష్కృతంగాఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు బుధవారం గనిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కాసిపేట గనిలో కొన్ని నెలలుగా నాణ్యమైన పనిముట్లులేక కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే చలికి వణుకుతున్న ట్రామర్ హెచ్‌వోపీ ఉద్యోగులకు, మెయిన్ ఇంక్లైన్ పనులుచేస్తున్న ఉద్యోగులకు స్వెటర్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. నాణ్యమైనగ్లౌజులు, బూట్లు,టెక్నీషియన్‌కు పనిముట్లు ఇవ్వాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం గనిమేనేజర్ భూశంకరయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పిట్‌సెక్రెటరీ మీనుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ పిట్‌సెక్రటరీ రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

సాలరీ అకౌంట్ల నమోదు ప్రారంభం

బెల్లంపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని శాంతిఖని గని షాఫ్ట్‌గని ఆవరణలో ప్రాజెక్టు అధికారి అబ్దుల్‌ఖాదిర్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీబ్యాంకు సహకారంతో కాంట్రాక్టుకార్మికులకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ సాలరీఅకౌంట్ల నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ సాలరీ అకౌంట్లతో కార్మికులకు రూ.30లక్షలవరకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గనిమేనేజర్‌సంజయ్‌కుమార్ సిన్హా, గనిసంక్షేమాధికారిసత్యనారాయణ, బ్యాంకుసాలరీటీమ్‌మేనేజర్ వినోద్ పాల్గొన్నారు.

సింగరేణి సామగ్రిని కాపాడాలి: సెక్యూరిటీ జీఎం


యార్డును తనిఖీ చేస్తున్న లక్ష్మీనారాయణ

శ్రీరాంపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సామగ్రిని అప్రమత్తతతో కాపాడాలని సెక్యూరిటీ జీఎం సీహెచ్ లక్ష్మీనారాయణ అన్నారు. సెక్యూరిటీ జీఎంగా బాధ్యతలు చేపట్టి బుధవారం శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చిన ఆయనను ఏరియా ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందించారు. అనంతరం ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి ఆధ్వర్యంలో ఎస్అండ్‌పీసీ కార్యాలయానికి ఆహ్వానించి ఉద్యోగులు సన్మానించారు. పూలమొక్కలు అందించారు. తదుపరి ఆయన ఏరియా స్టోర్స్‌లో సెంట్రల్ కేబుల్‌అండ్‌స్క్రాప్ యార్డును తనిఖీచేశారు. ఎస్ఆర్‌పీ ఓసీపీలోని అన్ని చెక్‌పోస్టులను, డీజిల్‌బంకులను, సీఆర్ఆర్ కంపెనీకి చెందిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. నిరంతరం అప్రమత్తతతో ఉంటూ సంస్థను కాపాడుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్‌ఇన్‌స్పెక్టర్లు స్వామి, రాంరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, సూపరింటెండెంట్ శంకరయ్య, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, షిఫ్ట్ జమేదార్లు, భద్రతా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీ జీఎంకు సన్మానం..

మందమర్రిటౌన్: మందమర్రి ఏరియాలో పర్యటించిన కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణను జీఎం కారాలయంలో జీఎందేవేందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టడంలో కార్పొరేట్ సెక్యూరటీ జీఎం లక్ష్మీనారాయణ ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఆస్తుల రక్షణకు తగిన సూచనలు అందిస్తున్నారని, ఆయన సూచనల మేరకు సెక్యూరిటీ గార్డులను అప్రమత్తం చేస్తున్నామన్నారు.

తొలగించిన సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలి

మందమర్రిటౌన్: మందమర్రి ఏరియాలో తొలగించిన ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణంలో సెక్యూరిటీ గార్డులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల 48మందిని టెండరు అయిపోయిందనే నెపంతో విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. దీంతో వీరి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. తొలగించిన కార్మికులను బేషరతుగా తీసుకోవాలని, ఈ విషయంపై జీఎంకు వినతిపత్రం అందిస్తున్నామన్నారు. విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

మందమర్రిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంస్థకు ఈ ఆర్థిక సంవత్సరం నిర్ధేశించిన లక్ష్యసాధనలో ఏరియాల వారీగా నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని, అనుకున్నదాని కంటే అదనపుఉత్పత్తి సాధిస్తేనే సంస్థ అభివృద్ధి సాధ్యమని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏరియాలోని కేకేఓసీపీని ఆయన సందర్శించారు. ఓసీపీ మ్యాపును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఉత్పత్తి లక్ష్యాల పెంపుదలకు సంబంధించి ఒకరికి ఒకరు పరస్పరం చర్చించుకోవాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ఓసీపీలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి రోజు మెరుగైన ఉత్పత్తి సాధించాలన్నారు. అధికారులు ఉత్పత్తిపై సమీక్షలు నిర్వహించాలన్నారు. సంస్థ మనదనే భావనతో ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్‌రెడ్డి, కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి మల్లయ్య,గని మేనేజర్ రామారావు పాల్గొన్నారు.


కేకే ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

'కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి'

శ్రీరాంపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణికాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్రఅధ్యక్షుడు డి బ్రహ్మానందం, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ వెంకన్న అన్నారు. ఈ మేరకు వారు బుధవారం సింగరేణి డైరెక్టర్(పా) జి వెంకటేశ్వర్ రెడ్డికి పలుసమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్/సీఎంపీఎఫ్ సౌకర్యాన్ని, 8.33శాతం బోనస్‌ను అందరు కాంట్రాక్టుకార్మికుల మాదిరిగా కల్పించాలన్నారు. ఒకరోజు డ్యూటీకి గైర్హాజరైతే 300 రూపాయలు కట్ చేస్తున్నారని, ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అధికారులు కొంతమంది కాంట్రాక్టు కార్మికులకు పూర్తిస్థాయిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలు తెరిపించలేదని ఆరోపించారు.

సరిహద్దు గ్రామాల్లో 'మహా' ఎన్నికల సందడి

5వ పేజీ తరువాయి

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బందోబస్తు..

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో కోటపల్లి మండలం రాపన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు ఎస్సైలతోపాటు సిబ్బందిని కేటాయించారు. రెండు రాష్ట్రాలను కలిపే ప్రాణహిత నది వంతెనపై నుంచి మహారాష్ట్రకు వెళ్లే వాహనాలను కొద్ది రోజులుగా తనిఖీ చేస్తున్నారు. సీపీ శ్రీనివాస్, మచిర్యాల డీసీపీ భాస్కర్ తరుచుగా చెక్‌పోస్టును సందర్శిస్తూ అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేశారు. అక్రమంగా డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభ పరిచే వస్తువులపై నిఘా పెంచారు. ఇప్పటి వరకు సుమారు రూ.5 లక్షల విలువైన మద్యం పట్టుబడింది.

సరిహద్దు గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని వివాదాస్పద గ్రామాల్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని 12 గ్రామాలు మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా రాజురా నియోజకవర్గం జివితి తాలుకా పరిధిలోకి వస్తాయి. ఈ గ్రామాల ప్రజలు తెలంగాణ, మహారాష్ట్ర రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారు. కెరమెరి మండలంలోని పరందోళి, అంతాపూర్, మహారాజ్‌గూడ, శంకర్‌లొద్ది, ముక్దంగూడ, లెండిగూడ, గౌరి, పద్మావతి, ఈసాపూర్, ఇందిరానగర్, బోలాపటార్ గ్రామాల్లో మొత్తం 3034 మంది ఓటర్లు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతేడాది నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలతోపాటు మహారాష్ట్రలో ఏప్రిల్ 19న జరిగిన పార్ల మెంట్ ఎన్నికల్లో, ఆ తరువాత మే 13న తెలంగాణలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తాజాగా బుధవారం జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆయాగ్రామాల ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతిసారి రెండు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఓటువేసి ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటున్నారు.

ఓటు వేసిన 1650 మంది

మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో జిల్లాపరిధిలోని పరం దోళి, అంతాపూర్ గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరందోళిలో 1422 మంది ఓటర్లకు గాను 735మంది, అంతాపూర్ పోలింగ్ కేంద్రాల్లో 1612 మంది ఓటర్లకు గాను 915మంది ఓటర్లు మొత్తం 1650 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 70 శాతం ఓటింగ్ నమోదైంది. చలితీవ్రత కారణంగా ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్, ఆ తరువాత పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు ఓటర్లు పెద్దఎత్తున తరలివచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మహారాష్ట్ర ప్రభుత్వం పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలను ఏర్పాటు చేశారు.

వంద మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



బెల్లంపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో పోలీసు శాఖ సహకారంతో నిర్వహిస్తున్న నిత్య జన గణమన జాతీయ గీతాలాపన కార్యక్రమం బుధవారంతో 300వ రోజుకు చేరింది. బజార్ ఏరియా ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి 100 మీటర్ల జాతీయ పతాకంతో కాంటా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని, సమైక్యత భావాన్ని పెంపొందించేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు.

జన్కాపూర్ వంట మాస్టర్లు..

- గ్రామంలో 300 మందికి పైగా ఉపాధి
- హోటళ్ళు, రెస్టారెంట్లు, శుభకార్యాల్లో వీరి వంటే...



వంట వండుతున్న సీనియర్ మాస్టర్ అశోక్



శుభకార్యంలో వంటలు వండుతున్న జన్కాపూర్ వంట బృందం

బెల్లంపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకలు, పుట్టిన రోజులు, గృహ ప్రవేశాలు, ఇతర ఏ వేడుకలైనా జిల్లా వాసులే కాకుండా ఇతర జిల్లా వాసులు సైతం జన్కాపూర్ వంట మాస్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ గ్రామం వంట మాస్టర్లకు పెట్టిన పేరుగా నిలుస్తుంది. రుచికరమైన వంటకాల్లో వాళ్లది అందె వేసిన చెయ్యి. మాంసహారం, శాకాహారంతో పాటు ఇతర ఏ వంటలైనా రుచికరంగా చేయడంలో జన్కాపూర్ మాస్టర్లు ప్రత్యేకతను చాటుకుంటున్నారు. జిల్లాలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు హైద్రాబాద్ వంటి ప్రముఖ పట్టణాల్లో సైతం జన్కాపూర్ వంట మాస్టర్లే ఉన్నారు.

● వంట మాస్టర్ మంచర్ల సీతారాంతో ఆరంభం

కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన మంచర్ల సీతారాం 40 ఏండ్ల క్రితం వంటలు చేసేవాడు. ఇతనికి నలుగురు కొడుకులు . ఇందులో ముగ్గురు శంకర్, లక్ష్మణ్, అశోక్‌లను సహాయం కోసం తీసుకువెళ్లేవాడు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వంట చేయడానికి ఆర్డర్లు వచ్చేవి. 22 సంవ త్సరాల క్రితం సీతారాం మృతి చెందడంతో ముగ్గురు కొడుకులు తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని వంట మాస్టర్లుగా రాణిస్తున్నారు.

● గ్రామంలో 300 మందికి పైగా వంట మాస్టర్లు

సీతారాం కుమారుడు అశోక్ రుచికరంగా వంటలు చేయడంలో ప్రావీణ్యం సంపాదించాడు. ఆర్డర్లు రావడంతో గ్రామంలోని కొందర్ని సహాయకులుగా తీసుకువెళ్లేవాడు. ఇలా సహాయకులుగా వెళ్లిన వారు సైతం అశోక్ వద్ద రెండు, మూడు సంవత్సరాలకు వంటలు నేర్చుకొని వంట మాస్టర్లుగా ఎదిగారు. గ్రామంలో 300 మందికి పైగా మాస్టర్లు ఉన్నారు.

● ప్రముఖుల శుభకార్యాల్లో

జిల్లాలోని ఎమ్మెల్యేలు, పోలీసు ఉన్నతాధికారుల ఇండ్లలో జరిగే శుభకార్యాలకు జన్కాపూర్ మాస్టర్లే వంటలు చేస్తుంటారు. రాజకీయ పార్టీలు జరిపే పెద్ద కార్యక్రమాలకు సైతం ఇక్కడి మాస్టర్లే వండుతారు. జిల్లాకు మంత్రులు వచ్చినప్పుడు ఎమ్మెల్యేలు జన్కాపూర్ వంట మాస్టర్లతో వంటలు చేయిస్తున్నారు.



హైద్రాబాద్‌లోని ఓ రెస్టారెంట్‌లో వంటలు వండుతున్న జన్కాపూర్ వంట మాస్టర్లు

35 ఏండ్ల నుంచి వంటలు చేస్తున్నా..



తండ్రికి సహాయకునిగా వెళ్లి వంటలు చేయడం నేర్చుకున్నా. 35 ఏండ్లుగా శుభకార్యాలకు వంటలు చేస్తున్నా. మహారాష్ట్రతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు వంటలు చేయడానికి వెళ్తుంటాను. నాతో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నా. నా దగ్గర వంట నేర్చుకున్న చాలా మంది రెస్టారెంట్లు, హోటళ్లలో పనిచేస్తున్నారు.

- మంచర్ల అశోక్, సీనియర్ వంట మాస్టర్, జన్కాపూర్

అన్ని రకాల వంటలు చేస్తాం ..



మాంసాహారం, శాకాహారం, స్నాక్స్‌లో చాలా రకాల వంటలు చేస్తాం. సీనియర్ వంట మాస్టర్ అశోక్ వద్దకు సహాయకునిగా వెళ్లి వంటలు నేర్చుకున్నా. వంటలు రుచి చూసి మెచ్చుకోవడం చాలా సంతోషంగా ఉంటుంది.

- సురేష్

రుచికరంగా చేస్తుండడంతోనే పేరు వచ్చింది



శుభకార్యాల్లో అందరికి నచ్చేలా వంటలు చేస్తుండడంతో మంచి పేరు వచ్చింది. తిన్నవారందరు రుచికరంగా ఉంటున్నాయని, ఒకరి ద్వారా మరొకరు మా పేర్లను చెబుతుండడంతో ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. మాకు దూర ప్రాంతాల నుంచి సైతం ఆర్డర్లు వస్తున్నాయి. గ్రామానికి పేరు రావడం సంతోషంగా ఉంది.

- ఈద రవి

న్యూస్ బాక్స్

నేడు బాక్సింగ్ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సహకారంతో అండర్ 14, 17 బాలికల, అండర్ 19 ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరిలు ఫణిరాజా, బాబురావులు బుధవారం తెలిపారు. టోర్నమెంట్ కన్వీనర్ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న, ఆర్గనైజర్ పీడీ సుదీప్‌ల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రాలతో రిపోర్టు చేయాలని, వివరాలకు చిలువేరు రాజేష్ 9963539234 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కుంరం సూరు వర్ధంతి

కాసిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కొలాం జాతి అమర వీరుడు కుంరం సూరు వర్ధంతిని బుధవారం కొత్త తిర్మలాపూర్‌లో కొలాం సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు శంకర్, టేకం శ్రీనివాస్, మడావి వెంకటేష్, ఆత్రం మహేష్, సిడాం గణపతి, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మందమర్రిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ పేర్కొన్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో జరిగిన కరాటే పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు జ్ఞానిక, శ్రేష్ఠ, కార్తికేయ, మణిదీప్ పతకాలు సాధించగా బుధవారం పాఠశాలలో అభినందించారు. కోచ్ రంగు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

తాండూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే 15 గ్రామపంచాయతీల్లో కొనసాగుతుందని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలో 9837 కుటుంబాలకు 9684 సర్వే పూర్తయినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కట్టడాన్ని కూల్చివేస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్

బెల్లంపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 9వ వార్డులో అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాన్ని బుధవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ కట్టడాన్ని కూల్చివేసినట్లు తహసీల్దార్ జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని తహసీల్దార్ పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కిషన్‌రెడ్డిని విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదన్నారు. రేవంత్‌రెడ్డి సమైక్యాంధ్రకు మద్దతు తెలిపి తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేయాలని చూసిన తెలంగాణ ద్రోహి అన్నారు. కిషన్‌రెడ్డి చిన్న స్థాయి కార్యకర్తగా ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తూ కేంద్ర మంత్రిగా ఎదిగారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తుంది బీజేపీ పార్టీయేనని తెలిపారు. ప్రతీ మండలంలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. నాయకులు పురుషోత్తం, అశోక్, వెంకటకృష్ణ, శ్రీదేవి, కృష్ణదేవరాయలు, రమేష్, అశ్విన్, ప్రవీణ్, గురువయ్య, వెంకటేశ్వర్‌రావు, రమేష్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

టీపీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

మంచిర్యాల అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నారాయణరావు ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన సమావేశంలో బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది రంగు వేణుకుమార్, ప్రధాన కార్యదర్శిగా సుమన చైతన్య, ఉపాధ్యక్షులుగా సిహెచ్ మొగిలి, రజిత, కోశాధికారిగా ఏ.సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా ఎం.శ్రీకాంత్, సృజనామోహన్, ఈసీ మెంబర్లుగా కె.కిరణ్‌కుమార్, నాగరాజు, ప్రశాంతి, తాళ్లపల్లి కవిత, గౌరవ సలహాదారులుగా కస్తూరి పద్మచరణ్, గుండేటి యోగేశ్వర్, చంద్రమోహన్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. అధ్యక్షుడు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, చెరుకు శశికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను పట్టించుకోని ముఖ్యమంత్రి



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బెల్లంపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా వ్యవస్థను పట్టించుకోవడం లేదని, విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పేర్కొన్నారు. బుధవారం పట్టణ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సావిత్రి, నాయకులు రాహుల్, శేఖర్, మహేందర్, అనిల్, క్రాంతి, వెంకటేష్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో పర్యటించిన విదేశీ బృందం



హరిత రిసార్ట్‌లో నెదర్లాండ్ , జర్మనీ దేశస్తులు

జన్నారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జర్మనీ, నెదర్లాండ్ దేశాలకు చెందిన 16 మంది ప్రతినిధుల బృందం ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూరు తదితర ఆదివాసీ గ్రామాల్లో పర్యటించారు. వారి స్థితిగతులను అధ్యయనం చేశారు. అనంతరం కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో మంగళవారం రాత్రి బస చేశారు. బుధవారం హైద్రాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి, విద్యార్థులు

గర్మిళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి అర్పితమారంరెడ్డి విద్యార్థులకు చట్టాలు, ర్యాగింగ్, బాల కార్మికుల నిర్మూలన, నిర్బంధ విద్యాహక్కు తదితర చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. పోక్సో చట్టం గురించి వివరించారు. ఎవరికైనా న్యాయ సలహాలు కావాలంటే టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పాత మంచిర్యాలలోని క్వాలిటీ బ్రెడ్ కంపెనీని తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులతో మాట్లాడారు. డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, హెచ్‌ఎం పద్మావతి, లేబర్ ఆఫీసర్‌లు రామ్మోహన్‌రావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలి

తాండూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నీలాయిపల్లి, మాదారం, మాదారం 3 ఇంక్లైన్ గ్రామాల్లో పర్యటించారు. సెగ్రిగేషన్ షెడ్లు, కంపోస్టు పిట్‌లను పరిశీలించారు. కంపోస్టు పిట్‌లో ఎరువులను తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. నిరంతరం ఎరువుల తయారీ కొనసాగించాలని సూచించారు. కంపోస్టును ఎరువును విక్రయించి వచ్చిన డబ్బులను పంచాయతీ సాధారణ నిధిలో జమ చేయాలన్నారు. నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. అనంతరం ఎంపీకే 5 గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పోచంపల్లి గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించి సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వివేక్, తదితరులు

శ్రీరాంపూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ అన్నారు. సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో సింహగర్జన వాల్ పోస్టర్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా లెక్కల ప్రకారం అత్యధికంగా 30 లక్షల మంది మాలలు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న మాలలను రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే సింహగర్జనకు మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మాల సంఘం నాయకులు తొగరు సదానందం, సుదమల్ల హరికృష్ణ, పొట్ట మధుకర్, సుధీర్, ముంతమాల పుల్లయ్య, కూన రవి, తిరుపతి పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఏసీపీ



గెలుపొందిన క్రీడాకారులతో ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన క్రీడాకారులను బుధవారం ఏసీపీ రవికుమార్ అభినందించారు. ఏసీపీ మాట్లాడుతూ క్రీడల ద్వారా ఉద్యోగావకాశాలకు రిజర్వేషన్‌లు ఉంటాయని, విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు దేవయ్య, అప్జలుద్దీన్, ఎస్ఐ మహేందర్, ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, పీఈటీ రాజేందర్, పీడీ హరీష్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు మంత్రుల పర్యటన

మంచిర్యాల,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం ముగ్గురు మంత్రులు పర్యటించనున్నారు. ఐబీ చౌరస్తా సమీపంలో నిర్మించ తలపెట్టిన 650 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌తోపాటు మాతాశిశు ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఫ్యామిలీ వెల్ఫేర్‌శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క)లు హాజరుకానున్నారు. హైద్రాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలిక్యాప్టర్‌లో బయల్దేరి ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. 11.45 గంటలకు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌ను మంత్రులు ఆవిష్కరించనున్నారు. 12 గంటలకు సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. భోజన విరామం అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసే పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం తిరిగి హైద్రాబాద్‌కు బయల్దేరి వెళ్తారు.

ఏర్పాట్లు పూర్తి...

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖలు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి సుమారు 4 వేల మందిని తరలించేందుకు కాంగ్రెస్ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. సభా వేదిక, ఇతర ఏర్పాట్లు చేశారు.

సరిహద్దు గ్రామాల్లో మహా ఎన్నికల సందడి

- తెలంగాణలో 12 గ్రామాల్లో ఓటర్లు
- అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీ బందోబస్తు



అహెరి నియోజకవర్గంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

మంచిర్యాల/ఆసిఫాబాద్/కెరమేరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాకు సరిహద్దున ఉండడం, అక్కడి ప్రజలు ఇక్కడ సత్సంబంధాలతో ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన పలువురు కూలీలు తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో ఉపాధికి వస్తారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడి గ్రామాలు సందడిగా మారాయి. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించి 12 గ్రామాల్లో ఓటర్లు ఉన్నారు. ఈ నెల 18తో ఎన్నికల ప్రచారం ముగియగా 288 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎన్నికలు నిర్వహించారు. మావోయిస్టు ప్రాబల్య, సమస్యాత్మక కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకే పోలింగ్ ముగించాల్సి ఉండగా, క్యూలో ఓటర్లు ఉండటంతో సాయంత్రం 6 వరకు కొనసాగింది.

బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ

మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. మహాఘడ్ బంధన్ (బీజేపీ కూటమి), ఇండియా ఘడ్ బంధన్ (ఇండియా కూటమి) మధ్య పోటీ హోరాహోరీగా ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఓటర్లు కాంగ్రెస్ కూటమి వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అలాగే పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో బీజేపీ కూటమికి కలిసి వస్తుందనే ప్రచారం సాగుతోంది. సిట్టింగ్ సీఎం ఎక్నాథ్ షిండే (బీజేపీ కూటమి) పథకం లాడ్లీ బహెన్ కింద మహిళలకు నెలకు రూ.1500 నాలుగు నెలలుగా అమలు చేస్తున్నారు. ఈ పథకం ఎన్నికల్లో లబ్ధి చేకూర్చిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో రెండు ప్రాంతీయ పార్టీలైన శివ్‌సేన, రాష్ట్రవాది పార్టీలు రెండు వర్గాలుగా చీలిపోయాయి. శివ్‌సేన అగ్రనేతలైన ఏక్నాథ్ షిండే బీజేపీ కూటమిలో ఉండగా ఉద్ధవ్ ఠాక్రే ఇండియా కూటమికి మద్దతు తెలిపారు. మరో ప్రాంతీయ పార్టీ రాష్ట్రవాది పార్టీ నేతలు అజిత్‌పవార్, శరత్ పవార్ సోదరులు రెండు వర్గాలుగా చీలిపోయి, రెండు కూటములకు ఒక్కొక్కరు మద్దతు ప్రకటించారు. అజిత్ పవార్ బీజేపీ వైపు, శరత్ పవార్ కాంగ్రెస్ వైపు నిలబడ్డారు.

మిగతా 7వ పేజీలో



ఓటరు కార్డులను చూపుతున్న తెలంగాణ సరిహద్దు పరందోళి గ్రామస్థులు

ఆసుపత్రి శంకుస్థాపనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐబీ ప్రాంతంలో గురువారం సూపర్ స్పెషాలిటీ, మాతా శిశు ఆసుపత్రి భవన సముదాయ నిర్మాణానికి చేపట్టే శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. బుధవారం ఆసుపత్రి శంకుస్థాపన చేసే ప్రాంతంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 650 పడకల ఆసుపత్రిగా నిర్మాణమవుతున్న ఆసుపత్రిని రానున్న రోజుల్లో 1200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని, 21 ఏప్రిల్ 2027 వరకు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఉత్తర తెలంగాణకే ఈ ఆసుపత్రి తలమానికంగా నిలవనుందన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కలకు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తనపై విమర్శలు చేస్తున్నా రన్నారు. రఘునాథ్‌రావు హద్దు దాటి విమర్శలు చేస్తున్నారని, ఆయన అదుపులో ఆయన ఉంటే మంచిదన్నారు. తనపై విమర్శలు చేసే ముం దు మోదీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చెప్పాలంటూ ప్రశ్నించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా పట్టించుకోనని, తాను ఓ విజన్‌తో పని చేసే వ్యక్తినని, నియోజకవర్గాన్ని విద్య, వైద్య సేవలకు హబ్‌గా మారుస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నాయకులు రామగిరి బానేష్, తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ

మంచిర్యాల అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐబీ ప్రాంతంలో సూపర్‌స్పెషాలిటీ, మాతా శిశు ఆసుపత్రుల శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్కలు రానున్న నేపథ్యంలో బందోబస్త్ ఏర్పాట్లను రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ మంచిర్యాల డీసీపీ భాస్కర్ పరిశీలించారు. సభ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, సభకు వచ్చే మార్గాలపై అధికారులతో సీపీ చర్చించారు. మం త్రులు పర్యటించే ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో నిఘా, పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేయాలన్నారు. అడిషనల్ డీసీపీ సి.రాజు, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, పట్టణ సీఐ ప్రమోద్‌రావు,ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ కమిషనర్‌ను కలిసిన సీపీ

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం వచ్చిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను సీపీ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీసీపీ ఏ.భాస్కర్, అడిషనల్ డీసీపీ సి.రాజు, పాల్గొన్నారు.

ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల



చేపపిల్లలను ప్రాజెక్టులో వదులుతున్న రామ్‌దాస్, మత్స్యకారులు

భీమారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టులో బుధవారం చేప పిల్లలను వదిలి పెట్టామని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీష్ రామ్‌దాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మూడు దఫాల్లో చేపపిల్లలను పంపిణీ చేశామన్నారు. మత్స్యకారులు చేపలను కాపాడుకుని వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి కోరారు. బుధవారం కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి సీసీఐ ఆధ్వర్యంలో చెన్నూరు కాటన్ కంపెనీలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను పొందాలన్నారు. రైతులను దళారులను ఆశ్రయించి వారి చేతుల్లో మోసపోవద్దన్నారు. అయితే రైతులు ప్రభుత్వం ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తినే కొనుగోలు చేస్తుందని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లా డి ఎకరానికి 16 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి రామానుజం, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సహకార సంఘాలను బలోపేతం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. 71 అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా మోర్ల లక్ష్మణ్ అధ్యక్షతన మండలంలోని సుద్దా ల గ్రామంలో శ్రీబాలాజీ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావే శానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహకార సంఘాలు పరస్పరం సహకరించుకుని సమన్వయంగా ప్రగతిపథంలో ముందుకు నడవాలన్నారు. జిల్లా సహకార సంఘం అధికారి సంజీవ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లం రాంరెడ్డి, లక్ష్మణ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి





కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్
హాజీపూర్ మండలం గుడిపేట కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. ధాన్యం కొన్న వెంటనే రైతుల వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేసి 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైసుమిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా అందించాలని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా రైసుమిల్లులు పనిచేయాలని, లేకుంటే చర్యలు తీసుకొంటామన్నారు. కొనుగోలు సమయంలో సంబంధిత రైతుకు రశీదులు జారీ చేయాలని తెలిపారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా వాహనాల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. గుడిపేటలో కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీవో కిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళతో కలిసి సందర్శించారు. ధాన్యంలో తేమ శాతం, కేంద్రాల్లో నిర్వహిస్తున్న రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సన్న, దొడ్డురకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు, నీడ, గన్నీ సంచులు అందుబాటులో ఉండాలన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలి

బెల్లంపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో బోధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ మాట్లా డుతూ చదువులో వెనకబడి ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యాచరణ ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా కుటుంబీకుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఆర్డీవో హరికృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మద్దతు ధరపై పత్తి కొనుగోలు చేయాలి

తాండూర్ (ఆంధ్రజ్యోతి): జిన్నింగు మిల్లులకు వచ్చే పత్తిని మద్దతు ధరపై కొనుగోలు చేయాలని, తేమ శాతం ఆధారంగా చెల్లింపులు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. రేపల్లెవాడలోని జిన్నింగు మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పత్తి 8 శాతం తేమ ఉంటే క్వింటాలుకు రూ.7521 వస్తుందని, 8 నుంచి 12 శాతం వరకు పెరిగే ఒక్కో శాతానికి రూ.75 చొప్పున క్వింటాలుకు మద్దతు తగ్గుతుందని తెలిపారు. రైతులకు పొలాల వద్దే తేమ శాతం పరిక్షించుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అదనంగా తేమ శాతం యంత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మిల్లులో పత్తి ప్రాసెసింగ్, ప్యాకింగ్ తీరును పరిశీలించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, డీటీ ప్రసాద్, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.